# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం । 23 సెప్టెంబర్ 2025 । ■ 13 పేజీలు


13



## బాసరలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

మొదటి రోజు శైలపుత్రి అవతారంలో అమ్మవారు



# కదం తొక్కిన అడవి బిడ్డలు

- లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాల్సిందే..
- ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
- ఏజెన్సీ జిల్లాలో ఆదివాసీల నిరసనలు
- లంబాడీలను ఎస్టీ నుంచి తొలగించాలని డిమాండ్
- ఇటీవలే సుప్రీం కోర్టులో ఆదివాసీ నేతల పిటిషన్
- ముదురుతున్న రిజర్వేషన్ వివాదం
- లంబాడాలతో నష్టపోతున్నామంటున్న ఆదివాసీ సంఘాలు

■ ప్రభాత సమాచారం, ఆదిలాబాద్

అనాదిగా అడవులను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, హక్కుల కోసం న్యాయపోరాటమే శరణ్యమని ఆదివాసీ సంఘాలు నేతలు తమ ఆవేదనను వెళ్లగక్కారు. చట్టబద్ధతలేని వలస లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాయిసెంటర్లు, సార్ మేడిలు, రాజ్ గోండు సేవా సమితి, తుడుం దెబ్బ ఇలా 9 ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తంతోలి ముత్యాలమ్మ ఆలయం నుండి ఆదిలాబాద్ కలెక్టరేట్ వరకు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించి కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా ఆదివాసి సంఘాల నాయకులు మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాల నుండి రిజర్వేషన్ల కోసం వలస వచ్చిన లంబాడాలతో ఆదివాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. 1970 తర్వాత ఆదిలాబాద్ జిల్లాకు వలస వచ్చిన లంబాడాలు తమ హక్కులను రిజర్వేషన్లను వినియోగించుకుంటూ తమ జీవన ప్రమాణాలు దెబ్బతిస్తున్నారని ఆరోపించారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల కుటుంబాలు ఎస్టీ రిజర్వేషన్ల కోసమే వలస వచ్చి ఉపాధి పొందుతున్నాయని వారు ఆరోపించారు. వివరాలు 13వ పేజీలో

12



## ఒక్కో కార్మికుడికి
# రూ.1,95,610

- సింగరేణి ఉద్యోగులకు 34శాతం దసరా బోనస్..
- కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500
- సింగరేణి పోరాటాన్ని చరిత్ర మరువదు
- కార్పొరేట్‌తో పోటీపడేలా సంస్థను తీర్చిదిద్దుతా
- కార్మికులకు అండగా ఉంటా
- సీఎం రేవంత్ రెడ్డి హామీ

సింగరేణి సంస్థ గడించిన లాభాలను ప్రకటించింది. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ ఆర్జించిన నికర లాభం రూ. 6,394 కోట్లుగా ప్రకటించారు. అందులో సింగరేణి భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టుల కోసం రూ. 4,034 కోట్లను కేటాయించగా, మిగిలిన రూ.2,360 కోట్లలో రూ.34 శాతం సొమ్ము అంటే రూ. 819 కోట్లను కార్మికుల వాటాగా బోనస్‌గా ప్రకటించారు. ఈ లెక్కన సంస్థలో పని చేస్తున్న 41వేల మంది కారికులకు ప్రకటించిన ప్రకారం 34 శాతం లాభాల బోనస్ కింద ఒక్కొక్కరికి రూ.1,95,610 వరకు లభించనున్నాయి. గత ఏడాది సగటున ఒక్కో కార్మికుడికి రూ.1,87,321 లాభాల బోనస్ చెల్లించగా, ఈ ఏడాది సగటున ఒక్కో ఉద్యోగికి అదనంగా రూ. 8,289 బోనస్ లభించనుంది.

13



## సరిహద్దులో హై అలర్ట్

ప్రాణహిత నది తీరం వెంట పోలీసుల తనిఖీలు

మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో పోలీసులు హై అలెర్ట్ ప్రకటించారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో సరిహద్దులో అలజడులకు తావివ్వకుండా పోలీసులు నిఘా పెంచారు. ప్రాణహిత నది తీరం వెంట తనిఖీలు చేపట్టారు. ప్రాణహిత నది మార్గంలోని ఫెర్రీ పాయింట్లను పరిశీలించారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ పేర్కొన్నారు.

వివరాలు 2లో



12



# తీవ్ర విషాదం

- వాగులో కొట్టుకుపోయిన తల్లిని కాపాడిన కుమారుడు.. తండ్రి మృతి
- నిండు ప్రాణాలను బలితీసుకున్న క్షణికావేశం
- వలస కార్మిక కుటుంబం ఆత్మహత్యాయత్నం
- తల్లి, పాప మృతి.. భర్తకు గాయాలు
- ర్యాగింగ్ భూతానికి విద్యార్థి బలి
- సీనియర్ల వేధింపులు తాళలేక ఆత్మహత్య
- వరద ఉధృతికి వాగులో మహిళ గల్లంతు
- ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా.. తప్పిన ప్రమాదం

ఉమ్మడి జిల్లాలో సోమవారం వివిధ ఘటనలు పచ్చని కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.. కుమ్రంభీం జిల్లా జైనూర్ మండలం చింతపల్లి పంచాయతీ పరిధిలోని కిషన్ నాయక్‌కు చెందిన జాదవ్ కనిరామ్(80), భార్య సరస్వతి, కుమారుడు అభినందన్‌లు కలిసి వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి బయలుదేరే సమయంలో జోరుగా వర్షం కురిసింది. దారి మధ్యలో ఉన్న వాగును దాటుతుండగా వాగు ఉధృతి పెరిగింది. ఈ సమయంలో తండ్రి కన్నిరామ్, తల్లి సరస్వతి ఇద్దరు చెరోవైపు కొట్టుక పోతుండగా ప్రాణాలకు తెగించి తల్లిని ఒడ్డుకు చేర్చాడు. ఇంతలోనే తండ్రి వాగులో కొట్టుకుపోయాడు.. కాజ్‌నగర్ మండలం చింతగూడకు చెందిన జగత్‌రామ్ ఆత్మహత్య చేసుకుంటానని రైల్వే ట్రాక్‌పై పడుకోగా ఆయనను తప్పించబోయే ప్రయత్నంలో రైలు ఢీకొని భార్య స్వప్న(25), పది నెలల కూతురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సీనియర్ల వేధింపులు తాళలేక ఉట్నూర్‌కు చెందిన జాదవ్ సాయితేజ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోనాల మండలంలోని సాకేర గ్రామం వద్ద సోమవారం రాత్రి ప్రవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది.. అయితే ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. భైంసా రూరల్ మండలంలోని బిజ్జూర్-బాబుల్‌గాం గ్రామాల మధ్య ఉన్న వాగును ఎడ్లబండిపై దాటుతుండగా ఈ ఘటనలో లక్ష్మీబాయితో పాటు ఎద్దు, గేదె మృతి చెందాయి.

# అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

■ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద







**చెన్నూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని చెన్నూరు పట్టణంలో గల శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి అందించడం జరుగుతుందని తెలిపారు. నిరుపేద ప్రజలకు గూడు కల్పించే ఉద్దేశంతో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు చొప్పున అందించడం జరుగుతుందని, డిసెంబర్ - 2025 తరువాత చెన్నూర్ నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి అర్హత గల లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అర్హత కలిగి ఉండి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కానీ వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. విద్యావ్యవస్థను పటిష్టపరిచే చర్యలలో భాగంగా జిల్లాలోని సోమనపల్లి గ్రామంలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెన్నూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను 2 కోట్ల 20 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయడంతో పాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డి.ఎం.ఎఫ్.టి./ సి.ఎస్.ఆర్. క్రింద 1 కోటి రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. విద్యావ్యవస్థ బలోపేతం చేసే దిశగా దాదాపు 10 వేల మంది నిష్ణాతులైన ఉపాధ్యాయులను భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, ఈ విద్య సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గం పరిధిలోని పాత ప్రభుత్వ పాఠశాల భవనాలను గుర్తించి అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూరు పట్టణంలో 6 పడకలుగా ఉన్న డయాలసిస్ సెంటర్ ను 10 పడకలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు 20 లక్షల రూపాయల నుండి 30 లక్షల రూపాయల వరకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 10 లక్షల రూపాయల పరిమితితో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండలంలోని 78 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలు



■ ప్రతీ సమస్య పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించాలి
■ 43 ఫిర్యాదులు స్వీకరించిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
■ వెంటనే అర్జీలను పరిష్కరించాలని అధికారులకు సూచనలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల రోజున జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి ప్రజలు జిల్లా ఎస్పీని నేరుగా కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలను విన్న జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి బాధితుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రతి ఒక్క సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఆదేశాలు ఇచ్చారు. ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయంలో దాదాపు 43 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలను విన్నవించుకున్న వారిలో భూ సమస్యలు, ఫోర్జరీ సమస్యలు, అన్నదమ్ముల కుటుంబ తగాదాలు, వివిధ కేసులకు సంబంధించిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీకి ప్రజలు నేరుగా తెలియజేశారు. సుదూర ప్రాంతాల ప్రజలు జిల్లా ఎస్పీ సమాచారం అందించాలన్న సమస్యలను విన్నవించాలన్న మెసేజ్ యువర్ ఎస్పీ అనే కార్యక్రమం ద్వారా ప్రారంభించబడిన 8712659973 నెంబర్‌కు వాట్సప్ ద్వారా సమాచారం కానీ ఫిర్యాదులను తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని కవిత పాల్గొన్నారు.



## యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్న

**తాండూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** సరిపడా యూరియాను పంపిణీ చేయాలని మళ్లీ అన్నదాతలు రోడెక్కారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం సమీపంలో గల జాతీయ రహదారిపై సోమవారం అన్నదాతలు రాస్తారోకో నిర్వహించారు. యూరియా పంపిణీ చేస్తున్నారని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయానికి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సరిపడా యూరియా బస్తాలు లేకపోవడంతో రైతులు ఆగ్రహించి ఆందోళన దిగారు. ఈ విషయం తెలిసిన వెంటనే రెబ్బెన ఎస్ఐ, పోలీసులు చేరుకొని రైతులకు ఎంత నచ్చజెప్పిన వినకుండా ఆందోళన కొనసాగిస్తున్నారు.

## నిర్మల్ పట్టణ అభివృద్ధికి భారీగా నిధుల మంజూరు

**నిర్మల్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** నిర్మల్ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం నుండి భారీ నిధులు కేటాయించబడ్డాయని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. పట్టణ అభివృద్ధి పనులకు రూ.15 కోట్లు, మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు రూ.42 కోట్లు మంజూరయ్యాయని ఆయన శనివారం ప్రకటించారు. పట్టణంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, పలు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నట్లు వెల్లడించారు. దసరా ఉత్సవాల అనంతరం అభివృద్ధి పనులు వేగంగా ప్రారంభం కానున్నాయని తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన వసతులు అందేలా కృషి చేస్తానన్నారు.

## ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్



**నిర్మల్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎంల గోదాంను పరిశీలించారు. గోదాంలో భద్రపరచిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను తనిఖీ చేసి సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతానికి ఎలాంటి లోటు ఉండకూడదని స్పష్టం చేశారు. గోదాంలో భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. 24 గంటల సెక్యూరిటీ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, అగ్ని మాపక పరికరాలు తప్పనిసరిగా సిద్ధంగా ఉంచాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. పారదర్శకమైన ఎన్నికల కోసం అన్ని చర్యలు కచ్చితంగా అమలు చేయాలనీ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సర్ఫరాజ్, సిబ్బంది రాజశ్రీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## వెంకన్న ఆలయ శిఖరానికి పిడుగు

**మామడ, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** మామడ మండలంలోని కొరటికల్ గ్రామంలో శరన్నవరాత్రి పర్వదినం రోజున విషాదకర ఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయ శిఖరానికి సోమవారం పిడుగు పడటంతో అది పూర్తిగా ధ్వంసమైంది. గోపురం కూడా స్వల్పంగా దెబ్బతిన్నది. ఆ సమయంలో ఎవరూ ప్రమాదానికి గురి కాకపోవడంతో గ్రామస్తులు ఊపిరిపించుకున్నారు.



## ఆదిలాబాద్ ప్రజావాణికి 82 దరఖాస్తులు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జిదారులు వారి సమస్యల పరిష్కారానికి అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా వివిధ శాఖలకు సంబంధించిన అర్జీలను అధికారులకు అందిస్తూ తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా 82 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.









# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- భీమారం మండల ప్రజలకు చేరువలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద

**భీమారం, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా భీమారం మండల ప్రజలకు చేరువలో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్ మోహన్, మండల తహసీల్దార్ వనజ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రజల సంక్షేమంలో భాగంగా భీమారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని, ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 15వ ఆర్థిక ప్రణాళికలో 1 కోటి 43 లక్షల రూపాయల నిధులతో పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భవన నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం సి.సి. రోడ్లు, మురుగు నీటి వ్యవస్థ నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేసి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. భీమారంలో 15 కోట్ల రూపాయలతో స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో రహదారుల నిర్మాణంలో అవసరమైన అటవీ అనుమతులు పొంది పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూర్, కోటపల్లి మండలాలలో పంట సాగుకు అవసరమైన 500 టన్నుల యూరియా అదనంగా అందించడం జరుగుతుందని, రైతులు ముందస్తుగా రబీ కోసం కాకుండా అవసరం మేరకు యూరియా వినియోగించుకోవాలని తెలిపారు. రామగుండం ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 10 వేల కోట్ల రూపాయలతో ఎరువుల పరిశ్రమను తిరిగి ప్రారంభించడం జరిగిందని, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలలో అవసరమైన యూరియా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సింగరేణి సంస్థలో గత సంవత్సరం 4 వేల 800 కోట్ల రూపాయల లాభం రాగా ఈ సంవత్సరం 6 వేల 340 కోట్ల రూపాయలు లాభం వచ్చిందని, రెగ్యులర్ కార్మికులకు 34 శాతం బోనస్, ఒప్పంద కార్మికులకు 5 వేల 500 రూపాయల బోనస్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ఇందులో భాగంగా అంబులెన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సీజనల్ వ్యాధులకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కృషి చేస్తామని, ఇందులో భాగంగా అవసరమైన ఫర్నిచర్, వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలలో నిపుణులైన వైద్యుల ద్వారా ప్రత్యేక వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండలంలోని 33 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్యులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానిపై కేసు

### కుమ్రంభీం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇస్తే యజమాని పై కేసు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. యజమానులు మైనర్ పిల్లలకు వాహనాలు నడిపేందుకు ఇవ్వొద్దని, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రమాదం జరిగితే వాహన యజమాని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం, నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడపడం, తప్పుడు నంబర్లు ఏర్పాటు చేయడం, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా శబ్ద కాలుష్యాన్ని సృష్టించే విధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను కలిగి ఉన్న వాహనదారులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. నిబంధనలకు లోబడి నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేయాలి, లేకపోతే వాహనదారుల చీటింగ్ కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. అదే విధంగా దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద నిర్వాహకులు పోలీసు నిబంధనలు పాటించాలన్నారు. మండపాల నిర్వాహకులు ఎటువంటి వివాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## జాతీయ రహదారుల నిర్మాణాలు రాష్ట్ర అభివృద్ధికి కీలకం



### కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**నిర్మల్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** జాతీయ రహదారుల నిర్మాణాలు రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి ముఖ్యమంత్రి, జాతీయ రహదారుల నిర్మాణ పనులు, భూసేకరణ సమస్యలు, పెండింగ్ మ్యుటేషన్, ఫారెస్ట్ క్లియరెన్స్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, నేషనల్ హైవేస్, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మాణాలతో రవాణా సౌకర్యాల అభివృద్ధితో పాటు వాణిజ్య, పారిశ్రామిక రంగాలు పురోగమిస్తాయని తెలిపారు. రహదారుల నిర్మాణాలు జరుగుతున్న జిల్లాల్లో భూసేకరణ, మ్యుటేషన్, అటవీ అనుమతుల ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పూర్తయిన రహదారులతో పాటు, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పరిహారం చెల్లింపులు తదితర అంశాలను వేగవంతం చేయాలన్నారు. ఎటువంటి కారణాలతోనూ రోడ్ల నిర్మాణంలో ఆటంకాలు తలెత్తకూడదని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాల వారీగా భూసేకరణ స్థితిగతులను ముఖ్యమంత్రి చర్చించారు. భూసేకరణ సమస్యలు, న్యాయపరమైన ఇబ్బందులు, పరిహారం చెల్లింపులు, రికార్డుల అప్‌డేషన్ వంటి అంశాలపై కలెక్టర్లు వివరాలు సమర్పించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** ఎస్టీ జాబితా నుండి లంబాడాలను తొలిగించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పుర్కచిత్రు స్పష్టం చేశారు. సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై సాయన్నను కలసి ఇంద్రవెల్లిలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు అనుమతి ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 24న ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో లంబాడాలను తొలిగించే విషయంపై భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుండి ఆదివాసీ 9తెగల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి సభను సక్సెస్ చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్ గోండు సేవా సమితి మండల అధ్యక్షుడు కనక తులసిరాం, తుడుం దెబ్బ



మండల గౌరవ అధ్యక్షుడు జుగ్నక్ భారత్, విద్యార్థి సంఘం జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు కనక గణేష్, సంక్షేమ పరిషత్ గౌరవ అధ్యక్షుడు ఆత్రం ధర్మ, రాజ్ గోండు సేవా సమితి జిల్లా నాయకులు సోయం రాందాస్ పాల్గొన్నారు.



## సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయండి

**నిర్మల్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** ప్రజలకు ఏ సమస్య వచ్చినా జిల్లా పోలీసులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో పోలీసుల ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. పోలీస్ శాఖ ప్రజలకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎస్పీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# టీ- ఫైబర్ బ్యాటరీలను చోరీ చేసిన వ్యక్తిపై కేసు నమోదు రిమాండ్‌కు తరలింపు



**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

టీ-ఫైబర్ బ్యాటరీలను రిపేర్ చేసి మళ్ళీ అమరుస్తానని గ్రామ పంచాయతీ సిబ్బందికి నమ్మించి మోసం చేసిన పైటనే ధనరాజ్(27)ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని ఉట్నూర్ సీఐ మడవి ప్రసాద్ తెలిపారు. సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ లో ప్రెస్ మీట్ నిర్వహించి, వివరాలను వెల్లడించారు. పైటనే ధనరాజ్ అనే గుడిహత్నూర్ మండలంలోని సోపాన్ ముత్నూర్ గ్రామానికి చెందిన వ్యక్తి గతంలో టీ-ఫైబర్ ఉద్యోగం చేసేవాడని, కొన్ని రోజులకు ఉద్యోగం మానేసి ఖాళీగా ఉన్నాడని తెలిపారు. గత జూలై, ఆగస్టు నెలలలో ఇంద్రవెల్లి మండలంలోని పిప్రి, మల్లాపూర్ గ్రామ పంచాయతీలో 6 బ్యాటరీలు, సిరికొండ మండలంలోని కొండాపూర్ గ్రామంలో 3 బ్యాటరీలు, గుడిహత్నూర్ మండలంలోని 3 బ్యాటరీలను తీసుకెళ్లి రేపర్ చేసి చేస్తానని గ్రామ పంచాయతీ సిబ్బందికి నమ్మించాడు. కొన్ని రోజుల తర్వాత టీ-ఫైబర్ ఫీల్డ్ ఇంజినీయర్ చిట్యాల రాజు టీ-ఫైబర్‌ల పని తీరును పరిశీలించడానికి రాగా అక్కడ బ్యాటరీలు కనపడకపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బందితో మాట్లాడి ఆరా తీయగా ధనరాజ్ తీసుకెళ్ళడానికి చెప్పారు. దీంతో ఖంగుతిన్న టీ-ఫైబర్ ఫీల్డ్ ఇంజినీయర్ చిట్యాల రాజు పైటనే ధనరాజ్ ను సంస్థ నుండి తొలిగించనట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తెలుపగా వారంతా షాక్ కు గురయ్యారు. మొత్తం 12 బ్యాటరీల విలువ 1లక్ష 50వేలు ఉంటుందని తెలిపారు.టీ- ఫైబర్ ఫీల్డ్ ఇంజినీయర్ చిట్యాల రాజు ఇచ్చిన పిర్యాదు మేరకు పైటనే ధనరాజ్ పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సాయన్న, కానిస్టేబుల్లు పవన్ కళ్యాణ్, చైతన్య, దినేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేత



**ఉట్నూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

సిరికొండ మండలంలోని సాత్మోరి గ్రామానికి చెందిన కుమ్ర దీపక్ ఇటీవల యూజీసీ సెట్ పరీక్ష రాసి అందులో ఉత్తీర్ణత సాధించాడు.అతను అతి సామాన్యమైన రైతు కుటుంబంలో జన్మించాడు.ఇటీవల రాసిన యూజీసీ సెట్ పరీక్షలో సెలెక్ట్ అయ్యాక అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్డీ కు ఎంపిక అయ్యాడు.పేద కుటుంబం కావడంతో ఫీజు కట్టుకోలేని స్థితిలో నెలకొంది.దీంతో కుమ్ర దీపక్ సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ను కలసి తన బాధను చెప్పుకొచ్చారు.దీంతో స్పందించిన ఎమ్మెల్యే కుమ్ర దీపక్‌కు తనవంతు సహాయంగా 5వేల రూపాయాల ఆర్థిక చేయూతను అందించారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా నా ఇంటి తలుపులు 24గంటలు తెరిచే ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు.చదువుకు పేదరికం అడ్డు కాదని పట్టుదల కృషితో చదవాలన్నారు. యువత చెడుకు దూరంగా ఉంటూ జ్ఞానాన్ని పొందడానికి అహర్నిశలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

### యూరియా కొరత తీర్చాలని

## అదనపు కలెక్టర్‌కు వినతి



**జన్నారం, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లాలో అన్ని మండలాల్లో యూరియా కొరత ఉందని ఆ కొరత తీర్చాలని సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో బిఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడి గంగాధర్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతు యూరియా లేక అల్లల్లాడుతున్నారన్నారు. ప్రస్తుతం రైతులు వేసుకున్న వరి పైరు పొట్ట దశకు చేరుకున్న తరుణంలో, సరిపడ యూరియా లేకపోవడంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. యూరియా కోసం రైతులు క్యూ లైన్‌లో నిల్చోని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒక్క పాస్ బుక్కుకు ఒకే యూరియా బస్తా ఇవ్వడం సరికాదన్నారు. ఎకరానికి ఒక యూరియా బస్తా ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### ఖానాపూర్‌కు చేరిన

## విశ్వబ్రాహ్మణుల చైతన్య యాత్ర

**ఖానాపూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

విశ్వబ్రాహ్మణులు చైతన్యవంతులు కావాలని, వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్ర నిర్వాహకులు కోరారు. విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈ యాత్ర సోమవారం ఖానాపూర్ మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా బాదంకుర్తి, మస్కాపూర్ మీదుగా ఖానాపూర్ పట్టణంలో నాయకులు ర్యాలీ నిర్వహించారు.



# నిందితులను కఠినంగా శిక్షించాలి



**ముధోల్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లి గ్రామంలో బీరప్ప ఆలయ శిఖర ధ్వంసానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామ అభివృద్ధి కమిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ముధోల్‌లోని తహసిల్ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీలతకు వినతిపత్రన్ని అందజేశారు. ఈ సందర్బంగా గ్రామ అభివృద్ధి కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. దుండగులను తక్షణమే పట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు విట్టల్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు రోళ్ల రమేష్, బిజేపి మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఎంపీటీసీలు పోతన్న యాదవ్, దేవోజీ భూమేష్, మాజీ సర్పంచ్ అనిల్, సభ్యులు ధర్మపురి సుదర్శన్, గుంజలోళ్ళ నారాయణ, మైత్రి సాయినాథ్, తాటేవర్ రమేష్, సుభాష్, జీవన్, మోహన్ యాదవ్, సాయి, విట్టల్, శంకర్, లవన్, శంకర్, భోజన్న, తదితరులు ఉన్నారు.

## గ్రామాల్లో కొలువుదీరిన దుర్గా మాత



**కుభీర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రమైన కుభీర్‌తో పాటు పార్డి (బి), పల్సి, సోనారి, పార్డి (కే) సెరపెల్లి గ్రామాలతో పాటు అన్ని గ్రామల్లో సోమవారం దుర్గ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమాయ్యాయి. మండల వ్యాప్తంగా మండపల నిర్వాహకులు దుర్గా దేవి ప్రతిమలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో సెరపెల్లి గ్రామంలో కర్ర దుర్గా మాతను ప్రతిష్టించి తొమ్మిది రోజుల పాటు పూజలు చేసి చివరి రోజున గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్దకు తీసుకువెళ్లి పూజలు చేసి భద్రపారుస్తారు.

## చింతలపల్లెలో వైద్య శిబిరం

**జన్నారం, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

మండలంలోని చింతలపల్లి గ్రామంలో సోమవారం మండల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామస్తులకు బీపీ ,షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి జ్వర పీడితులకు రక్తపూతలు తీసి మందులు పంపిణీ చేయడం జరిగిందని ప్రభుత్వ ఎమ్మెల్ హెచ్పి పల్లవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్ర పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, దోమలు పుట్టకుండా దోమలు కుట్టకుండా చూసుకోవాలన్నారు. మలేరియా డెంగ్యూ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రషీద్ ఖాన్, సంధ్య, వనిత, గ్రామస్తులు పాల్గొన్నారు.





### బతుకమ్మ పాట సీడీని

## ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

**జన్నారం, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కలమడుగు గ్రామంలో ఉన్న వివేకానంద పాఠశాల ఆధ్వర్యంలో రూపొందించిన బంగారు బతుకమ్మ పాట సిడిని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చేతుల మీదుగా ఉట్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విడుదల చేయడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ అమరగొండ సతీష్ గౌడ్ తెలిపారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆడపడుచుల బతుకమ్మ పండుగను కళ్లకు కట్టినట్టుగా చూపెట్టడానికి పాటను వివేకానంద పాఠశాల యాజమాన్యం రూపొందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ లక్ష్మి నారాయణ, పాఠశాల, ఇంచార్జీ తిరుపతి, ట్రస్మ రాష్ట్ర నాయకులు షబ్బీర్ పాల్గొన్నారు.



### విద్యార్థి ఆత్మహత్యకు

## కారణమైన వారిని శిక్షించాలి

**జన్నారం, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

మేడ్చల్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలోని నార్నూర్ మండలం నాగలకొండ చెందిన సాయి తేజను కళాశాల సీనియర్లు ర్యాగింగ్ చేసి ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని మండల ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షులు అజ్మీరా బిమ్లాల్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం జన్నారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని లేని పక్షంలో బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో లంబాడ ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, సాయికిరణ్, రాహుల్ పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్

## పోటీల రెఫరీగా వెంకట రామకృష్ణ

**రెబ్బెన, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 24 నుంచి 28 వరకు తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్‌లో జరగబోయే జాతీయ స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రెఫ్రీగా రిక్కల వెంకట రామకృష్ణను నియమించినట్లు బాల్ బ్యాడ్మింటన్ ఆఫ్ ఇండియా చీఫ్ రెఫ్రి జ్యోతిష్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కూడా అనేక జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఆల్ ఇండియా రిఫరీగా తన సేవలు అందించారు. జాతీయస్థాయి పోటీలకు రెఫరీగా ఎంపికైనటువంటి రిక్కల వెంకట రామకృష్ణను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ ఆర్. నారాయణరెడ్డి, అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్ తిరుపతి, సెపక్ తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస రెడ్డి షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వంగ మహేందర్, ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కోశాధికారి ఉప్పులేటి శంకర్, పిఈటీ భాస్కర్, చందర్, సీనియర్ క్రీడాకారులు హరిలాల్ తదితరులు అభినందించారు.

# బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బతుకమ్మ పండుగ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవరాత్రుల్లో ప్రతి రోజు బతుకమ్మ వేడుకలు వైభవంగా జరగాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమ తమ కార్యాలయాల్లో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పండుగ జరపాలని, సద్దుల బతుకమ్మ రోజున ఊరేగింపులో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులలో రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన పెంచేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేయాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బతుకమ్మ సంబరాలు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల వద్ద బతుకమ్మ నిమజ్జనం ప్రాంతాల్లో లైటింగ్, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పట్టణంలో సద్దుల బతుకమ్మను నిర్వహించేందుకు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'పోషణ మాసం'కు సంబంధించిన గోడ ప్రతిని అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిపిఓ శ్రీనివాస్, డీఈఓ భోజన్న, డి పి ఆర్ ఓ విష్ణువర్ధన్, ఉద్యాన వన శాఖ అధికారి రమణ, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డి ఈ హరిభువన్, సిడిపిఓ సరిత, అధికారులు పాల్గొన్నారు.





### పేదలకు ఆపన్న హస్తం

# సీఎం సహాయనిధి

## ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** పేదల మేలు కోరే ఏకైక ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉట్నూర్ మండలంలోని శాంతినగర్ కాలనికి చెందిన సరళ్ళ లక్ష్మీకు మంజూరైన 60వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి ఆర్థిక చేయూతను అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రాత్మకమైన పథకాలను అమలు చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి ప్రతిష్టాపన

**ముథోల్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** మండల కేంద్రమైన ముథోల్ తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గ దేవి మండపాల నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించిన మండపాలలో దుర్గాదేవిని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్టించారు. ఈ సందర్భంగా మొదటి రోజు అమ్మవారు శైలపుత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో భక్తులు అమ్మవారికి మొక్కలను చెల్లించుకున్నారు. దేవి శరన్న నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు అమ్మవారి మలధారణ స్వీకరించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని గంగపుత్ర, ముదిరాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించనున్న దుర్గాదేవి అమ్మవారిని గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఎస్సై బిట్ల పెర్సెస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



# మాజీ మంత్రి నర్సారెడ్డి జయంతి వేడుకలు



**సారంగాపూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** మండల కేంద్రంలో మాజీ మంత్రివర్యులు పొద్దుటూరి నర్సారెడ్డి 95వ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడారు..ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా పనిచేసి భూ చట్టం అమలు చేసి తన స్వంత భూమిని పేదలకు పంపిన మహనీయుడు స్వర్ణ ప్రాజెక్ట్ నిర్మాత అని ఆయన సేవలను కొనియాడారు. రాష్ట్రప్రభుత్వం స్వర్ణ ప్రాజెక్టు పి.నర్సారెడ్డి పేరు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అయిర నారాయణ రెడ్డి, అడెల్లి పోచమ్మ దేవస్థాన చైర్మన్ సింగం భోజ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ రాజేశ్వర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య,మాజీ మార్కెట్ చైర్మన్ రాజ్ మహమ్మద్, మాజీ అడెల్లి చైర్మన్ ఉట్ల రాజేశ్వర్, స్వర్ణ ప్రాజెక్టు మాజీ చైర్మన్ ఓలత్రి నారాయణ రెడ్డి,నాయకులు లక్ష్మారెడ్డి, కె.నారాయణ రెడ్డి, నర్సారెడ్డి, జగదీష్, జ్ఞానేశ్వర్, సలీమ్, దాసరి లక్ష్మణ్,చిన్నయ్య,పోతన్న దాసరి రమేష్, లక్ష్మణ్ రావు పటేల్, నారాయణ రెడ్డి, సురేందర్, రమణ, కేకే రావు, మార్కెట్ డైరెక్టర్లు, నర్సారెడ్డి పాల్గొన్నారు.



### పర్యావరణ విద్య బ్రాండ్

# అంబాసిడర్‌గా మోహన్ రావు

**నిర్మల్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** పర్యావరణ విద్య బ్రాండ్ అంబాసిడర్ గా జిల్లా ఎన్జీసి సమన్వయకర్త మోహన్ రావును నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ఎన్జీసి డైరెక్టర్ డబ్ల్యూ జి ప్రసన్నకుమార్ ఇచ్చిన నియామక ఉత్తర్వులను నేడు నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో భోజన్న, మోహన్ రావును అభినందిస్తూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పర్యావరణ విద్యలో భాగంగా, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నివారణ, సుస్థిర అలవాట్లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు పర్యావరణ పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు.

# జీతాలు ఇవ్వాలని కార్మికుల నిరసన

**ఉట్నూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ ఆస్పత్రులలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల 4నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ట్రైడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంకంటి సుభాష్ డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా ఆసుపత్రి ఎదుట కార్మికులతో కలసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పెండ్లింగ్ ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు.ఈనెల 16న హైదరాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాలో రాష్ట్ర ప్రభుత్వం మాటిచ్చి మాట తప్పిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 4నెలల వేతనాలను విడుదల చేయాలని,లేని పక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




# ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్‌కు ఘన సన్మానం

**మందమర్రి, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)** మండలంలోని పొన్నారం గ్రామపంచాయతీకి చెందిన మిడివెల్లి వెంకటేష్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందగా ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. 2016 నుండి కొమరం భీమ్ అసుఫాబాద్ జిల్లా డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ విభాగంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహించిన వెంకటేష్ పదోన్నతి పొంది బెల్లంపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న వెంకటేష్ ను టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇదిలా ఉండగా పొన్నారం గ్రామానికి చెందిన వెంకటేష్ ఎక్సైజ్ కానిస్టేబుల్ గా విధుల్లో చేరి అంచెలంచెలుగా ఎదిగి హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందడం గ్రామానికి గర్వకారణమని, రానున్న రోజుల్లో మరిన్ని పదోన్నతులు పొంది గ్రామానికి, డిపార్ట్మెంట్ కు పేరు తీసుకు రావాలని గ్రామస్తులు కోరారు. పదోన్నతి పొందిన వెంకటేష్ ను గ్రామస్తు లు వాల రవీందర్ రావు, సంకె శ్రీనివాస్, మాస్ సంతోష్, పెంచాల మధు, పెంచల రాజు, పెంచాల రాజలింగు, గడ్డం శ్రీనివాస్, సిరిమల్ల శ్రీనివాస్, పెంచాల రంజిత్, దొంథ సంపత్, ఈద లింగయ్య,లు అభినందించారు.



# యూరియా కోసం రైతుల రాస్తారోకో

**బెజ్జూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపై యూరియా కోసం రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడినప్పటికీ సరిపడ యూరియా దొరకడం లేదని చెప్పారు. అదను దాటి పోతున్నా సకాలంలో యూరియా అందక సాగు చేసిన పంటలు నష్ట పోయే అవకాశం ఉందని ఆందోళన చేశారు. యూరియా సోమవారం ఇస్తారని చెప్పి పంపిణీ చేయక పోవడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు రోడ్డుపై బైఠాయిచారు. ఏవో రావాలి యూరియా ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఏవో నాగరాజు, ఎస్సై సర్తాజ్ పాషా సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. యూరియా ఇచ్చేందుకు రైతులకు టోకెన్లు జారీ చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. రైతులు చేపట్టిన ధర్నాకు వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

**రెబ్బెన :** యూరియా రైతులకు సరిపడటం లేదని పంపిణీ చేయాలని సోమవారం రైతులు రెబ్బెనలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రెండు రోజులగా యూరియా కోసం వస్తున్నా అధికారులు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై వెంకట కృష్ణ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అధికారులతో చర్చలు జరిపించి రైతులకు యూరియా అందేలా



చూస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.



## విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**కుభీర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీలో బీరప్ప దేవుని విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటనపై కుభీర్ మండల కురుమ కులస్తులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై భైంసా అడిషనల్ ఎస్పి అవినాష్, ఎస్సై కృష్ణారెడ్డి, తహసీల్దార్ శివరాజ్‌లకు కుభీర్ మండల కురుమ కులస్తులు ఆయా పోలీస్ స్టేషన్లో, తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్బంగా దుండగులను తక్షణమే గుర్తించి అదుపులకు తీసుకొని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాయినాథ్, నిమ్మ బీరు, డోలేవార్ కామాజీ, మాజీ ఉపసర్పంచ్ దత్త్రాత్రి, కుబీర్ సంఘం అధ్యక్షుడు దత్త్రాత్రి, డోలేవార్ పోతన్న, సాయినాథ్, బాబన్న, దేవన్న, టేకులవార్ బాలాజీ, నాగేష్, సాయినాథ్, ఈరన్న, ఆయా గ్రామ కురుమ కులస్తులు తదితరులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించే వరకు ఆమరణ నిరాహార దీక్ష



**నార్నూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
ముప్పై పడకల దవాఖానలో సమస్యలు పరిష్కరించాలని ఆమరణ నిరాహారదీక్ష ను చేపట్టనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు బిక్కు రాథోడ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. నార్నూర్, గాదిగూడ మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ముప్పై పడకల హాస్పిటల్‌ను ప్రారంభించారన్నారు. అత్యవసర సమయంలో మెరుగైన చికిత్స కోసం ఉట్నూర్, అదిలాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. నేడు హాస్పిటల్ ఎదుట సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఆమరణ నిరాహార దీక్ష పట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకాష్, దేవిదాస్, రాజబాబు, మహేందర్, శ్రీకాంత్, శ్రీధర్ తదితరులున్నారు.

## డైట్ మైదానంలో దసరా ఉత్సవాలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో విజయ దశమి పండగను పురస్కరించుకుని అక్టోబర్ 2న దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ కత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సమితి సభ్యులతో కలిసి డైట్ మైదానాన్ని పరిశీలించి మాట్లాడారు. సమితి ఆధ్వర్యంలో గత 12 ఏళ్లుగా రావణ బొమ్మ దహన కార్యక్రమం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా అదేవిధంగా కొనసాగిస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మాధవ్, కోశాధికారి సూర్యకాంత్, రవీందర్ పాల్గొన్నారు.



## అర్హులందరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి



**నార్నూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
అర్హులందరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని రాజ్ గోండు సేవా సమితి మండల అధ్యక్షుడు ఆత్రం పరమేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 18 గ్రామాలకు చెందిన గిరిజనులు, రాజ్ గోండు సేవా సమితి నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడతగా ప్రభుత్వం అర్హులకు ఇళ్లను ఇవ్వకుండా వారికి అనుకూలంగా ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని మండిపడ్డారు. అధికారులు కేటాయించిన ఇండ్ల సర్వే చేపట్టి అర్హులను గుర్తించి న్యాయం చేయాలన్నారు. గ్రామానికి ఒకటి రెండు ఇల్లు కాకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిడం మాల్కు పటేల్, బాదిరావు పటేల్, మాన్కు పటేల్, అమృత్ పటేల్, అంబాజీ పటేల్, జాలిం షాప్ పటేల్, జగన్నాథ్ రావు, జాలింషావ్, జంగు, కొద్దు, లక్ష్మణ్, పరశురాం, వసంతరావు పాల్గొన్నారు.

# రిమ్స్ మొదటి ఏడాది ప్రవేశాలు ప్రారంభం



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
రిమ్స్ వైద్య కళాశాలలో 2025-26 ఏడాదికి ఎంబీబీఎస్ లో మొదటి ఏడాది రాష్ట్ర కోటా ప్రవేశాలు ప్రారంభం అయ్యాయి. రాష్ట్ర కోటాలో మొదటి విడతగా ప్రభుత్వం 81 సీట్లను కేటాయించగా సోమవారం నాటికి 68 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. రాష్ట్ర కోటా మొదటి విడతలో ప్రవేశాలు పొందటానికి మంగళవారం చివరి గడువును విధించారు. ఆల్ ఇండియా కోటాలో మొత్తం 15 సీట్లు కేటాయించగా రెండో విడతలో ఇప్పటి వరకు ఏడుగురు ప్రవేశాలు పొందారు. ఆల్ ఇండియా కోటాలో ప్రవేశాలకు ఈ నెల 27 చివరి గడువుగా ప్రభుత్వం నిర్ణయించింది. రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాథోడ్ జైసింగ్ నూతన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తూ ఉత్తర్వులను అందజేశారు. విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ఎన్ఎంసీ నోడల్ అధికారి ప్రశాంత్ ఆధ్వర్యంలో వైద్యులు భానుప్రకాష్, సుధాకర్, ఇనాయతుల్లా, ఇర్ఫానద్దీన్, మనోహర్ తదితరులు చేశారు.



## కొలువుదీరిన దుర్గమ్మ

**తాండూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
దుర్గా నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. తాండూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని పలుచోట్ల దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజులపాటు అత్యంత భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాల తొలిరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాదారం టౌన్ షిప్ లోని కోదండ రామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు అవధూత శర్మ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు అమ్మవారికి దసరా శరన్నవ రాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నారు.

## శ్రీమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**నిర్మల్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శ్రీమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అర్చకులు, మాజీ కౌన్సిలర్లు అయ్యన్న గారి రాజేందర్, పద్మాకర్, ఆలయ కమిటీ పదాధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఏలేటి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



## ఎయిడ్స్‌పై జన జాగృతి కళావేదిక ఆధ్వర్యంలో అవగాహన

**తాండూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా జన జాగృతి కళావేదిక ఆధ్వర్యంలో గ్రామస్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. మంచిర్యాల జిల్లా డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు తాండూర్ మండల కేంద్రం ఐబీలో సోమవారం కళాకారులు పల్లె సుద్దులు, పాటలు, మాటలతో ప్రజల్ని చైతన్య పరిచారు. అరక్షితమైన లైంగిక సంబంధాల ద్వారా, కలుషితమైన సూదులు, సిరంజీలు, కలుషితమైన రక్తమార్పిడి ద్వారా, హెచ్ఐవీ సోకిన తల్లి నుంచి బిడ్డకు వస్తుందని వివరించారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు




తీసుకోవాలని, ఐసీటీసీ కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ రాజు, తిరుపతి, కళాకారులు గణేష్, శంకర్, గౌతమ్, హిమశ్రీ, చైల్డ్ వన్ ఇండియా లింక్ వర్కర్స్ రాజేశ్వరి, భాస్కర్, అనిత ఎన్జీవో పార్వతి, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తీలో భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం దుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. మంగళహారతులు, బ్యాండ్ చప్పుళ్ళ నడుమ దుర్గాదేవి అమ్మవారికి మహిళలు వైభవంగా స్వాగతం పలికారు. మొదటి రోజు బాలా త్రిపుర సుందరి అవతారంలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల ప్రారంభోత్సవంలో మాజీ కౌన్సిలర్ పూలు ఉమాదేవి శ్రీనివాస్, భవాని ఉత్సవ కమిటీ సభ్యులు తిరుపతి, అనుదీప్, క్రాంతి, రాజు, వంశీ, సన్నీ, లతోపాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

**వేతనాలు చెల్లించాలని..**

## నల్ల బ్యాడ్జీలతో నిరసన



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ సిబ్బంది సోమవారం వేతనాలు చెల్లించాలంటూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. గత నాలుగు నెలల నుండి తమకు వేతనాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు అందాల్సిన వేతనాలు చెల్లించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ట్రేడ్ యూనియన్ స్టేట్ జాయింట్ సెక్రటరీ ఓం నారాయణ, శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ సిబ్బంది అనిల్, వెంకటస్వామి, చంద్రమౌళి, అన్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పొలం బాట పనులకు
## బోథ్ ఎమ్మెల్యే భూమి పూజ



**బోథ్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
సోమవారం సొనాల మండలంలోని సాకేర దుర్గాదేవి ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలపై దేవి ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ దేవి నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, పొలం బాట కార్యక్రమంలో భాగంగా 10 లక్షల రూపాయల వ్యయంతో పొలాలకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు.

# నేరాల నియంత్రణ లక్ష్యంగా పోలీసులు పనిచేయాలి : అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్

**కుభీర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు పనిచేయాలని భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. నిర్మల్ జిల్లా కుభీర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన పరిసరాలను పరిశీలించి, పోలీసులతో కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. అంతకుముందు స్టేషన్ ఆవరణలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్సై కృష్ణారెడ్డికి సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, మోసపూరిత ఆన్‌లైన్ కార్యకలాపాలను అరికట్టడం, తక్షణ చర్యల ద్వారా బాధితులకు న్యాయం చేయడం వంటి అంశాల్లో ముందుండాలని పేర్కొన్నారు. సైబర్ క్రైం దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అత్యంత కీలకమన్నారు. భవిష్యత్తులో మరింత నైపుణ్యంతో కేసులు పరిష్క రించేలా సైబర్ వారియర్‌లను ప్రోత్సహిస్తున్నామన్నారు. సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ లో నియమించిన సైబర్ వారియర్స్ తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన వ్యక్తులు డబ్బు బ్యాంకులో ఫ్రీజ్ అయి ఉన్నట్లయితే వీలైనంత త్వరగా డబ్బులు తిరిగి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. అనుకోని రీతిలో ఎవరైనా సైబర్ నేరానికి గురైతే కంగారు పడకుండా వెంటనే 1930 ఫోన్ నంబర్‌కు, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌ను గానీ, దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో గాని సంప్రదించాలని వెల్లడించారు.




## నిత్యవసర సరుకులు పంపిణీ




**మందమర్రి, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
నిరుపేద కుటుంబానికి మేమున్నామంటూ నిత్యవసర సరుకులు అందించి అండగా నిలిచారు ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు. పట్టణంలోని మూడో జోన్ రామాలయం సమీపంలో టైలర్ వృత్తి చేసుకుని జీవిస్తున్న హనుమాండ్ల శ్రీనివాస్ కొద్ది రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. అనారోగ్యంతో ఇంటికే పరిమితం కావడంతో పూట గడవని పరిస్థితి నెలకొంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పట్టణానికి చెందిన ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ముందుకు వచ్చి తమ వంతుగా బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భం గా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ అజీమొద్దీన్ జిల్లా అధ్యక్షుడు నందిపాట రాజ్ కుమార్‌లు మాట్లాడారు. పట్టణం, పరిసర ప్రాంతాల్లో నిరుపేదలకు ఎలాంటి కష్టం ఉన్నా మా సంస్థ దృష్టికి తీసుకు వస్తే సంస్థ తరఫున మా వంతు సహాయం అందించి, నిరుపేదలకు అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు జావిద్ పాషా, చిలువేరి రాజు, నాగరాజు, శేఖర్, అరుణ్ దేవ్‌తలు పాల్గొన్నారు.

## దసరాకు ఊరు వెళ్లే ప్రజలు
## జాగ్రత్తలు పాటించాలి

**జన్నారం, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
దసరా పండగ సెలవుల్లో ఊరికి వెళ్లే ప్రజలు పోలీస్ శాఖ సూచించిన జాగ్రత్తలను పాటించాలని ఎస్ఐ గొల్లపల్లి అనుష పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... దసరా సెలవులను పురస్కరించుకొని గ్రామస్థులు చాలా వరకు వేరే ఊరికి వెళ్తుంటారని, ఆ సమయంలో తమ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే ప్రజలు జాగ్రత్తలు తప్పక పాటించాలని సూచించారు. నగలు, డబ్బులు ఇంట్లో పెట్టకుండా బ్యాంకులో భద్రపరచుకోవాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని ఆమె కోరారు. పండగ సందర్భంగా గొర్రెలు, మేకలు దొంగతనాలు ఎక్కువ జరిగే అవకాశాలు ఉన్నాయని, పెంపకందారులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఊర్లకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్సై అనూష సూచించారు.



## ప్రజావాణి కార్యక్రమంలో
## ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సోమవారం పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలను స్వీకరించారు. మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ప్రజలు నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఫిర్యాదుదారుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం



**తాండూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
తాండూరు మండల కేంద్రంలోని మహాలక్ష్మి వాడ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ స్వరూప రాణి మాట్లాడుతూ, తల్లిపాలు, పోషకాహారం, గర్భిణీ, బాలింతల ఆరోగ్యం, పిల్లల సంరక్షణ, కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ స్వరూప, టీచర్ భారతి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
ఇటీవల కురిసిన వర్షాల్లో ఇల్లు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన సత్యనారాయణకు సోమవారం వాసవి క్లబ్ కార్యాలయంలో ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి సంతోష్, బెల్లంపల్లి అధ్యక్షులు మహేష్, పూర్వాధ్యక్షులు శ్రీనివాస్, రీజన్ చైర్మన్ వంశీకృష్ణ పాల్గొన్నారు.



# వాతావరణ శాఖ కీలక హెచ్చరిక



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
రాగల మూడు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. ముఖ్యంగా, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రత్యేకంగా హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

**బంగాళాఖాతంలో బలపడనున్న అల్పపీడనం...**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రైతులకు, ప్రజలకు వర్ష సూచనతో పాటుగా వాతావరణ బులెటిన్ జారీ చేసింది. బంగాళాఖాతంలో సోమవారం ఈశాన్య ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. రానున్న 24 గంటల్లో ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనించి వాయువ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతం కానుంది. తాజాగా మరో అల్పపీడనం ఈ నెల 25న తూర్పు మధ్య, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడే అవకాశం ఉంది. ఈ అల్పపీడనం మరింత బలపడి 26 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఈ వాయుగుండం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ 27న దక్షిణ ఒడిశా, ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలను దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

**భారీ నుంచి అతిభారీ వర్షాలు...**

భారీ వర్షాలు కుమరం భీం అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో కూడిన వర్షాలు కురుస్తాయన్న కారణంతో పలు ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాల కారణంగా సాధారణ జనజీవనం కొంతమేర ప్రభావితమైంది. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

# బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాలకు భద్రత ఏర్పాట్లు పూర్తి

**మంచిర్యాల, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
బతుకమ్మ, దుర్గామాత నవరాత్రి వేడుకలకు ముందస్తు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. మంచిర్యాల, పెద్దపల్లి జోన్ పరిధిలో మహిళలు బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో దుర్గామాత అమ్మవారు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో భద్రత ఏర్పా ట్లను పర్యవేక్షిస్తూ పెట్రోలింగ్ విజబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా సాయంత్రం బతుకమ్మ ఆడే సమయం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిఘా పెట్టాలన్నారు. దుర్గామాత నవరాత్రి వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని దీని కోసం భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

**ఊరికి వెళ్లే వారు సమాచారం అందించాలి..**
పండుగ సందర్భంగా ఇంటికి తాళం వేసి వెళ్లే ప్రజలు స్థానిక పోలీ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. వారి వివరాల ను నమోదు చేసుకొని వారి ఇండ్లపై నిఘా ఏర్పాటు చేస్తామ న్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచా రం అందించాలన్నారు.





## ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి

**ఉట్నూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు గొప్పవని, వాటి పరిరక్షణ చేస్తూ ముందుకెళ్లాలని ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పట్టేల్, ఐటీడిఎ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ప్రత్యేక సంచికను వేరు వేరుగా వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను బాహ్య ప్రపంచానికి తెలిసేలా, ఆదివాసీలను చైతన్యం చేసేలా వ్యాసలను ప్రత్యేక సంచిక తీసుకువచ్చిన టిఏజి స్ నాయకత్వం ను అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు తో పాటు నాయకులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరిస్తాం

### ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా

**ఉట్నూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
ఐటీడీఏకు వచ్చి అందించే అర్జీలను పరిష్క రిస్తామని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్ లోని ఐటీడీఏ పీఓ ఛాంబర్ లో గ్రీవెన్స్ సెల్ నిర్వ హించారు. గిరిజనుల నుండి దరఖాస్తులను పీఓ స్వీకరిస్తూ సమస్యలను విన్నారు. అర్జీదారుల నుండి వచ్చిన దరఖాస్తు లను త్వరితగతిన పరిష్కరించాలనీ అధికారులను ఆదేశిం చారు. తలమడుగులోని కాపర్దేవి గ్రామానికి చెందిన చిత్రకళ తనకు కిరాణా దుకాణం మంజూరు, ఇచ్చోడకు చెందిన చెందిన కరణ్ కుమార్ తనకు ట్రైకర్ లోన్ మంజూరు చేయాలని, జైనూర్‌లోని పాట్నపూర్ గ్రామానికి చెందిన ఉత్తమ్ తనకు వాటర్ ప్లాంట్ నిర్వహణ కొరకు లోన్ ఇవ్వాలని, కేరెమెరిలో మెట్ట పిరి గ్రామానికి చెందిన యాశోద తనకు ఐసిటి ఉపాధ్యాయ ఉద్యోగం కల్పించామని కోరుతూ వేరు వేరుగా అర్జీలు పీఓ కు అందజేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు

**జన్నారం, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్నారంలోని మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం ఎదురుగా దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించారు. నిర్వాహకులు అమ్మవారిని బాలా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## భీమారం పీహెచ్‌సీ ప్రారంభంలో పోలీసులు, కాంగ్రెస్ నేతల మధ్య తోపులాట



**భీమారం, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా కాంగ్రెస్ నేతలకు.. పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. సోమవారం

### ఏసీపీ, సీఐపై మంత్రి అసహనం

మంత్రి వివేక్‌తో పాటు కలెక్టర్ కుమార్ దీపక్ పీహెచ్‌సీ ప్రారంభించిన అనంతరం హాస్పిటల్ లోపల కలియదిరుగుతున్నారు. అదే సమయంలో భీమారం కాంగ్రెస్ కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లను పోలీసులు లోపలికి రాకుండా అడ్డుకున్నారు. జైపూర్ మండల అధ్యక్షుడు మహ్మద్ ఫాయజొద్దీన్, నాయకుడు రిక్కుల శ్రీనివాస్ రెడ్డి రాగా, వారిని సైతం అడ్డుకోవడంతో ఘర్షణ వాతవరణం నెలకొంది. కార్యకర్తలను అడ్డుకోవడానికి మీరెవరని ప్రశ్నించడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఇందుకు స్పందించిన మంత్రి వివేక్ పోలీసులపై సీరియస్ అయ్యారు. ఏసీపీ వెంకటేశ్వర్లతో పాటు కోటపల్లి సీఐ బన్సీలాల్‌పై అసహనం వ్యక్తం చేశారు.

## రిజర్వేషన్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా రిజర్వేషన్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్లకు రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టేందుకు విధివిధానాలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో వార్డు సభ్యుల స్థానాలు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనకబడిన తరగతులు జనాభాను ప్రామాణికంగా తీసుకోవాలని, 2019 స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల రిజర్వేషన్‌ను, 2011 జనాభా, 2024 సంవత్సరంలో ప్రభుత్వం చేపట్టిన వెనకబడిన తరగతుల గణన ప్రామాణికంలో తీసుకోవాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలో సర్పంచ్, వార్డు సభ్యులకు నిబంధనలను పాటించాలని అన్నారు. రిజర్వేషన్ ప్రక్రియలు ఎలాంటి లోటు పాట్లు జరగకుండా పకడ్బంధీగా చేపట్టి నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మినారాయణ, డీపీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

## నాటు పడవలో వెళ్లి.. మల్లన్నను దర్శించుకున్న అనిల్ జాదవ్

**ఇచ్చోడ, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
అతి ప్రాచీన ఆలయాల్లో ఒకటైన సిరిచెల్మలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఇచ్చోడ మండలంలోని పురాతన సిరిచెల్మలోని శివాల యంలో దేవి నవరాత్రుల సందర్భంగా ఎమ్మెల్యే ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ నీరు నిలువ ఉండడంతో నాటు పడవ మీద వెళ్ళి శివునికి ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ నియోజకవర్గ ప్రజలకు దేవి నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రజలు అందరూ సుఖ శాంతులతో ఉండి, పాడిపంటలు బాగా పండి రైతులకు మంచి దిగుబడి రావాలి ఆ శివున్ని కోరుకున్నానని పేర్కొన్నారు.





## సింగరేణి లాభాలపై స్వేత పత్రం విడుదల చేయాలి


### సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
సింగరేణి సంస్థ సాధించిన లాభాలపై యాజమాన్యం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాలు ప్రకటించకుండా ఆర్థిక సంవత్సరం ముగిసి నెలలు గడుస్తున్నప్పటికీ కార్మికులు కార్మిక సంఘాల ఆందోళన పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ముఖ్యమంత్రితో లాభాలు ప్రకటించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. 2024-25 ఆర్థిక సం,,లో సంస్థ సాధించిన వాస్తవ లాభాలు 6394 కోట్లు కాగా అందులో 4034 కోట్లు పక్కనపెట్టి 2360 కోట్లపై 34 శాతం 802.40 కోట్లు కార్మికులకు చెల్లిస్తున్నామని ప్రకటించడం కార్మికులను మోసగించడమేనని ఆయన యజమాన్యం, ప్రభుత్వంపై తీవ్రంగా మండి పడ్డారు. కాంట్రాక్ట్ కార్మికులకు గత సం,,లో 5000 చెల్లిస్తే ఈసారి 5500 చెల్లించడానికి నిర్ణయించారని, లాభాల వాటా చెల్లింపులో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు నిరాశే మిగిల్చారని లాభాల ప్రకటన కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. వాస్తవ లాభాలు దాచిపెట్టి 6 నెలలుగా కార్మికులను కార్మిక సంఘాల ను ఆందోళన బాట పట్టించి చివరకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యాన్ని కల్పించి కార్మికులను మరోసారి మోసం చేయడానికి కారణమైన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను కార్మికులు నిలదీయాలని కోరారు. లాభాల వాటా ప్రకటన సందర్భంగా కార్మికులు ఆశించిన విధంగా మారుపేర్ల సమస్య పరిష్కారం, సొంతింటి పథకం అమలు, రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ 42 వేల కోట్ల రూపాయలు చెల్లింపు, అలవెన్స్ లపై ఇన్కమ్ టాక్స్ కార్మికులకు తిరిగి చెల్లింపు, దసరా సెలవు అక్టోబర్ 3 న ఇవ్వడానికి అంగీకారం తదితర అంశాలపై పరిష్కారం దొరుకుతుందని ఆశించిన కార్మికుల ఆశలు అడియాసలయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజకీయ జోక్యాన్ని తగ్గించడానికి ఐక్య పోరాటాలే పరిష్కారం అన్న విషయం గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు.



## అభిమానుల కోరిక..

`కల్కి 2` నుంచి బాలీవుడ్ నటి దీపికా పదుకొణే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. దీంతో అమ్మడు పోషించిన తులసి పాత్రను ఏ నటితో భర్తీ చేస్తారు? అన్నది ఆసక్తికరంగా మారింది. పాన్ ఇండియా ప్రాజెక్ట్ కాబట్టి ఏ నటిని తీసుకున్నా ఆ రేంజ్ నటినే తీసుకోవాలి. కొత్త వారిని తీసుకునే పరిస్థితి లేదు. అలా చూసుకుంటే బాలీవుడ్ నటీమణులే కనిపిస్తున్నారు. కానీ మేకర్స్ మాత్రం ఈసారి వాళ్లకంటే బాగా తెలిసిన వారికే ఛాన్స్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది పూర్తిగా దర్శకుడు నాగ్ అశ్విన్ నిర్ణయం మీదనే ఆధారపడి ఉంది. ఈ ప్రాజెక్ట్ కి కర్త, కర్మ, క్రియ అన్నీ ఆయనే. హీరో..నిర్మాత ముఖ్యమే అయినా ఇద్దరు నాగీని దాటి వెళ్లరు. ఆయన మాట కాదనలేరు. కాబట్టి ఏ హీరోయిన్ ని ఎంపిక చేయాలి? అన్నది అతడి నిర్ణయమే. పైగా ఇలాంటి విషయాల్లో ప్రభాస్ కూడా పెద్దగా కల్పించుకోడు. మేకర్స్ నిర్ణయానికే కట్టుబడి పని చేస్తారు. కానీ ఈ సినిమా హీరోయిన్ విషయంలో మాత్రం డార్లింగ్ చొరవ తీసుకుంటేనే బాగుంటుది? అన్న అభిప్రాయం అభిమానుల నుంచి వ్యక్తమవుతోంది. ప్రభాస్ కి పర్ఫెక్ట్ జోడీగా అనుష్క శెట్టి మాత్రమే సరితూగుతుందని ఇంకెవ్వరు సాటి రాలేరని..ఈ నేపథ్యంలో ఆమెనే తీసుకుంటే బాగుంటుందని ఫ్యాన్స్ కోరుతున్నారు. సినిమాలో సుమతి పాత్ర కూడా గర్భవతిగా కనిపిస్తుంది. ప్రస్తుతం అనుష్క రూపంలో కొన్ని రకాల మార్పులున్న నేపథ్యంలో సుమతి పాత్రకు పక్కాగా సరిపో తుందంటున్నారు. `బాహుబలి` సినిమాతో పాన్ ఇండియాలో కూడా ఆమెకు గుర్తింపు ఉండటంతో ఆమెని మించిన నటిని వెతకడం అంటే? సమయం వృదాగానే భావిస్తున్నారు.కానీ ఇక్కడ అనుష్క ఎంటర్ అవ్వాలంటే రెండు జరగాలి. ఒకటి నాగీ ఆమె విషయంలో పూర్తి సంతృప్తిగా ఉండి పిలివగలగాలి. అలా కాకపోతే? ప్రభాస్ అనుష్క పేరును సజెస్ట్ చేయాలి. డార్లింగ్ రికమండేషన్ అంటే నాగీ కూడా అంత తేలిగ్గా కొట్టి పారేయలేరు. తాను కూడా పరిశీలనలోకి తీసుకుంటారు. అవసరమైతే లుక్ టెస్టులు చేసి అన్ని రకాలుగా ఫిట్ అనుకుంటే? తీసుకోవొచ్చు. లేదా హోల్డ్ లో పెట్టొచ్చు. ఎవరు సెట్ కాని పరిస్థితుల్లో అనుష్కను మళ్లీ పున:పరిశీలన చేసి తీసు కునే అవకాశం ఉంటుంది.



## యానిమల్ హీరోకు హ్యూమన్ రైట్స్ కమిషన్ నోటీసులు!

బాలీవుడ్ స్టార్ హీరో, రణబీర్ కపూర్‌కు కొత్త వివాదం ఎదురైంది. ఆర్యన్ ఖాన్ దర్శకత్వం వహించిన 'ది బాస్టర్డ్స్ ఆఫ్ బాలీవుడ్' వెబ్ సిరీస్‌లో ఆయన ఎలక్ట్రిక్ సిగరెట్ తాగుతున్నట్లు కనిపించిన సన్నివేశంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సన్నివేశం నిషేధిత వస్తువును ప్రోత్సహించేలా ఉందని, యువతపై తప్పుడు ప్రభావాన్ని చూపుతుందని ఓ ఫిర్యాదురావడంతోNHRC స్పందించింది. ముంబైలోని వినయ్ జోషి అనే వ్యక్తి ఈ సినిమాలోని వేపింగ్ సీన్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. 2019లో ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం ప్రకారం, ఈసిగరెట్ల ఉత్పత్తి, దిగుమతి, విక్రయం, నిల్వ, పంపిణీ మరియు ప్రకటనలు చేయడం నేరం. అయితే, ఈ వెబ్ సిరీస్‌లో రణబీర్ కపూర్ ఎటువంటి హెచ్చరికలు లేకుండా వేపింగ్ చేస్తున్నట్లు చూపించడంపై ఫిర్యాదుదారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది చట్ట ఉల్లంఘన అని ఆయన పేర్కొన్నారు.దీనిపై స్పందించిన NHRCరణబీర్ కపూర్, వెబ్ సిరీస్ నిర్మాతలు, అలాగే నెట్‌ఫ్లిక్స్‌పై చర్యలు తీసుకోవాలని ముంబై పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ వివాదంపై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖను కూడా ఆదేశించింది. ఇలాంటి కంటెంట్ యువతను తప్పుదోవ పట్టించకుండా, తక్షణమే నిషేధించాలని కూడా NHRC కోరింది.



బాలీవుడ్ భామ జాన్వి కపూర్ తెలుగులో పాగా వేయాలని ప్రయత్నిస్తున్నా కూడా అది కుదిరే పనిలా కనిపించట్లేదు. ఎన్ టీ ఆర్ కు జతగా దేవర లో తంగం పాత్రలో నటించింది జాన్వి. ఆ సినిమాలో అసలు ఆమె గ్లామర్ షోకి తప్ప ఎందుకు ఉపయోగ పడలేదు. ఆ మాత్రం రోల్ కి జాన్వి కపూర్ ఎందుకనే విమర్శలు వచ్చాయి. జాన్వి కూడా ఎన్ టీ ఆర్ తో సినిమా అనే తప్ప సినిమాలో తన రోల్ ఎలాంటిది అన్న ఆలోచన లేకుండా చేసింది. దేవర రిజల్ట్ జాన్వి కపూర్ కి షాక్ ఇచ్చినట్టే అయ్యింది. ఐనా సరే నెక్స్ట్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తో పెద్ది సినిమాలో నటిస్తుంది అమ్మడు. చరణ్ బుచ్చి బాబు కాంబినేషన్ సినిమాలో జాన్వి కపూర్ ఛాన్స్ పట్టేసింది. ఐతే పెద్ది ఫస్ట్ షాట్ తోనే సినిమా రేంజ్ ఏంటో చూపించారు. ఉప్పెన తర్వాత మరో గ్రిప్పింగ్ స్టోరీతో పెద్ది చేస్తున్నాడు బుచ్చి బాబు. ఐతే ఈ సినిమాలో అయినా జాన్వి తన రోల్ తో మెప్పిస్తుందా అన్న డిస్కషన్ నడుస్తుంది. ఇక జాన్వి కపూర్ నెక్స్ట్ తెలుగులో చేసే సినిమాపై కూడా చర్చలు జరుగుతున్నాయి. ఐతే రీసెంట్ గా ఒక సూపర్ సక్సెస్ ఫుల్ హీరో సినిమాలో జన్వి కి ఛాన్స్ వచ్చిందని ఆమె ఆ ప్రాజెక్ట్ హోల్డ్ లో పెట్టిందని అన్నారు. టాలీవుడ్ లో వరుస హిట్లతో దూసుకెళ్తున్నడు నాని. అతను ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో ది ప్యారడైజ్ సినిమా చేస్తున్నాడు. ఆ సినిమా తర్వాత సుజిత్ డైరెక్షన్ లో సినిమా ఉంటుందని తెలుస్తుంది. సుజిత్ తో నాని చేసే సినిమా ఒక రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ అట. ఈ సినిమాలో నానికి జతగా జాన్వి కపూర్ ని తీసుకోవాలనే టాక్స్ నడుస్తున్నాయి. ఐతే పెద్ది తర్వాత జాన్వి నానితో సినిమాకు ఓకే అంటుందా లేదా అన్న క్లారిటీ రాలేదు. నానితో సినిమా అంటే కచ్చితంగా హీరోయిన్స్ కి మంచి స్కోప్ దొరుకుతుంది. ఐతే ఈ సినిమా విషయంలో జాన్వి కాలిక్యులేషన్స్ ఎలా ఉన్నాయో తెలియదు. కచ్చితంగా అమ్మడికి ఇది ఒక మంచి ఆఫర్ అవుతుంది. నాని ది ప్యారడైజ్ రిలీజ్ అనంతరం సుజిత్ సినిమా సెట్స్ మీదకు తీసుకెళ్తాడట. డివివి దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమాలో హీరోయిన్ ఎవరన్నది త్వరలో తెలుస్తుంది. ఇదే కాదు నాని ది ప్యారడైజ్ సినిమా గురించి అన్ని డీటైల్స్ తెలుస్తున్నాయి కానీ అందులో హీరోయిన్ గా ఎవరిని తీసుకున్నారన్నది కూడా రివీల్ చేయలేదు.

## జాన్వి అతనికి ఓకే చెబుతుందా..?




## 'అధీర' నుంచి అదిరిపోయే అప్డేట్!

డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా ప్రేక్షకులను అలరించనున్నట్లు ప్రశాంత్ వర్మ అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తాజాగా మరో కొత్త సినిమా ప్రకటించారు. 'అధీర' అనే టైటిల్ తో ఓ సూపర్ హీరో చిత్రాన్ని అనౌన్స్ చేశారు. ఇందులో ఎస్. జే సూర్య, కళ్యాణ్ దాసరి ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. "ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు వెలుగు రూపంలో ఆశ పుట్టుకొస్తుంది" అంటూ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ షేర్ చేశారు. ఇందులో ఎస్. జే సూర్య లుక్ ప్రేక్షకులను తెగ ఆకట్టుకుంటోంది. ఇంతక ముందెప్పుడూ చూడని ఒక డిఫరెంట్ లుక్ లో ఆయన కనిపించారు. ఇప్పటికే ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి సూపర్ హీరో ఫిల్మ్ 'హను-మ్యాన్' బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఎలాంటి అంచనాలు లేకుండా చిన్న సినిమాగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ. 300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. దీంతో అతడి రాబోయే సినిమాలపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలి



## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
దుర్గా మాత శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ ఎస్పీ అఖిల్ మహాజన్ శుభాకాంక్షలు తెలియజేశారు. నవరాత్రి ఉత్సవాలు, నిమ్జనం సమయంలో డీజేలకు అనుమతులు లేవని సుప్రీంకోర్టు నియమ నిబంధనలకులోబడి సౌండ్ బాక్సును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో నిబంధనలు ఉల్లంఘించిన జిల్లా వ్యాప్తంగా 15 మంది డీజే యజమానులపై కేసుల నమోదు చేసి డీజేలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. రాత్రి సమయాలలో మహిళలు ఎక్కువగా ఉండే ప్రదేశాలలో శారదా దేవి మండప కమిటీల వద్ద ప్రత్యేకంగా మహిళా సిబ్బందిచే మరియు షీ టీం బృందాలచే నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు ఈవిటీజింగ్‌కు, ఆకతాయిలు వేధింపులకు, వికృతి చేష్టలకు ఎలాంటి ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 ద్వారా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించి సహాయాన్ని పొందవచ్చును సూచించారు. రాత్రి సమయాలలో యువత అనవసరంగా తిరగడం మానివేయాలని సూచించారు. మహిళలు ఎక్కువగా ఉండే ప్రదేశాలలో యువత, తెలియని వారు వారిని వీడియోలు తీయడం, వికృత శాష్టాలు చేయడం చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా మండపాలలో యువత రాత్రి సమయాలలో నిద్రించే విధంగా సరైన ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. వీలైనంతవరకు మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలన్నారు. మహిళలు చైన్ స్నాచింగ్ పట్ల అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు, పోలీసు యంత్రాంగం పెట్రోలింగ్ గస్తీ నిర్వహిస్తూ పర్యవేక్షిస్తుందని తెలిపారు. దసరా పండగకు సొంత ఊర్లకు వెళ్లేవారు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని, విలువైన సామగ్రిని వస్తువులను ఇంట్లో ఉంచకుండా చూడాలని తెలిపారు. ముఖ్యంగా నిమర్జనం ఉత్సవాలను నిర్ణీత సమయంలో పూర్తిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మండప కమిటీ సభ్యులు మరియు హిందు ఉత్సవ సమితి సభ్యులు పర్యవేక్షించాలని సూచించారు.

# భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా రాష్ట్రంలో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం, అటవీ శాఖ అనుమతులపై చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, జాతీయ రహదారులు, అటవీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అటవీ శాఖాధికారులు, అదనపు కలెక్టర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారి, రవాణా, జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపడుతున్న జాతీయ రహదారులు, గ్రీన్ ఫీల్డ్ జాతీయ




రహదారుల నిర్మాణంలో ముంపునకు గురవుతున్న భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల వివరాలను సేకరించి వారికి మెరుగైన నష్ట పరిహారం అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అటవీ శాఖ అనుమతులు, కోర్టు కేసులను త్వరగా పరిష్కరించి సంబంధిత యజమానులకు నష్ట పరిహారం అందించాలని చెప్పారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో గల వీసీ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వరరావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మించిన జాతీయ రహదారి నిర్మాణంలో భూములు, ఇళ్లు ఇతర ఆస్తులు కోల్పోయిన వారికి నష్ట పరిహారం అందిస్తున్నామని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న కేసులపై న్యాయస్థానం తీర్పుతో సంబం? దిత యజమానులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా రహదారుల నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతుల కోసం చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.



## యూరియా కోసం
# రైతుల పడిగాపులు

**వాంకిడి, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
యూరి యా కోసం రైతన్న కష్టాలు తప్పడంలేదు. రోజురోజుకు యూరియా కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. యూరియా వచ్చిందని తెలిస్తే చాలు వ్యవసాయ పనులు విడిచి రోజంతా భోజనం చేయకుండా వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని మన గ్రోమోర్ లో యూరియా రావడంతో శని, ఆదివారం రైతులకు పంపిణీ చేశారు. సోమవారం కేవలం 1,500 యూరియా బ్యాగులు మాత్రమే ఉన్నాయని తెలియడంతో మండలంలోని రైతులు భారీగా తరలి వచ్చారు. ఉదయం నుంచి క్యూలో ఉన్న రైతులు నిరసంతో నిలబడలేక చెప్పులను క్యూలో పెట్టారు. రెండు రోజుల క్రితం టోకేన్లు ఇచ్చి న రైతులతో పాటు ఇతర రైతులు కూడా తరలిరావడంతో మన గ్రోమోర్ వద్ద రైతులు బారులు తీరారు. రెండు రోజుల క్రితం టోకేన్లు ఇచ్చిన రైతులకే యూరియా ఇస్తామని చెప్పడంతో టోకెన్లు తీసు కోని రైతులు ఆందోళనకు దిగారు. అందరికీ టోకేన్లు ఇచ్చి రైతులందరికి యూరియా ఇవ్వాలని వాగ్వా దానికి దిగారు విషయం తెలుసుకున్న ఎస్ఐ మహేందర్ అందరికి టోకెన్‌లు ఇచ్చి యూరియా పంపిణీ జరిగేలా చూస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. పోలీసు బందో బస్తు మద్య రైతులకు యూరియా పంపిణీ చేశారు.

**పెంచికలపేట :** మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సోమవారం యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఏవో మనీషా రైతులకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. అలాగే మరి కొంత మంది రైతులకు టోకెన్లు అందజేశారు. మధ్యాహ్న సమయంలో టోకెన్లు అయిపోయాయయని తెలపడంతో రైతులు ఆమె వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో ఎస్సై అనిల్ కుమార్ రైతులకు నచ్చచెప్పి క్యూలైన్ ఏర్పాటు చేశారు. దీంతో వ్యవసాయాధికారులు క్యూలైన్లలో ఉన్న రైతులకు టోకెన్లు జారీ చేశారు. కోనేరు కార్యకర్తలు రైతులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**దహెగాం :** మండల కేంద్రంలో మనగ్రోమోర్ సెంటర్ వద్ద యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారం తెలుసుకున్న రైతులు బారులు తీరారు. ఉదయం ఆరు గంటలకే రైతులు చేరుకుని రాత్రి 8 గంటల వరకు వరుసలో ఉండి ఒకటి లేదా రెండు యూరియా బస్తాలు ఇవ్వడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. మొత్తం 1, 111 యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్నట్లు ఏవో రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు వంశీ, లావణ్య, సిబ్బంది శ్రీనివాస్, రాజు, చందు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్యతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన తనకు గ్రామ శివారులో గల భూమి ఆస్తులు ఉన్న వారి పేర్లు తొలగించి అసలు పట్టాదారులు అయినా తమ పేరిట పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఎ.ఐ.ఎస్.బి. విద్యార్థి సంఘం ప్రతినిధులు తమ దరఖాస్తులో లక్షెట్టిపేట బి.సి. వసతి గృహం, బెల్లంపల్లి ఎస్.సి. వసతి గృహాల విద్యార్థుల సంక్షేమంలో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. చెన్నూర్ పట్టణానికి చెందిన కౌట్ల సతీష్ చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని తన ఇంటికి ఇంటి పన్ను అధికంగా వస్తుందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన మహమ్మద్ రసూల్ బి తన భర్త మరణించారని, తన పిల్లలు తన పోషణ చూసుకోవడం లేదని, ఈ విషయమై తనకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం ఇంధనపల్లి గ్రామానికి చెందిన పెంద్రం యశ్వంత్ రావు తాను దివ్యాంగుడను అని, గత 10 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివసిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం బుద్ధిపల్లి గ్రామానికి చెందిన ఐరగడ్డ దేవమ్మ తాను గతంలో కొనుగోలు చేసిన భూమిని తన పేరిట మార్చి పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం గోపాల్ నాగారం గ్రామానికి చెందిన గాజుల తిరుపతి, గాజుల వెంకటేశం, గాజుల రవి తమ తండ్రి పేరిట తాండూర్ గ్రామ శివారులో గల భూమి రెవెన్యూ రికార్డులలో ఇతరుల పేరుట చూపుతోందని, ఈ పొరపాటున సవరించి తమ పేరిట మార్చాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం బూదకలాన్ గ్రామానికి చెందిన రైతులు తమ చేనులోనికి వెళ్లడానికి దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పీఎం మన్ కీ బాత్‌లో ప్రశంసలు అందుకున్న టీచర్‌కు సన్మానం




**ఉట్నూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
పీఎం మన్ కీ బాత్‌లో ప్రశంసలు అందుకొని,రాష్ట్రపతి విందు కార్యక్రమంలో పాల్గొనివచ్చిన ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ ను సోమవారం సన్ షైన్ స్కూల్ యాజమాన్యం సన్మానించింది.వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు ఉట్నూర్ లోని సన్ షైన్ స్కూల్ లో శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ రచయిత ఉపాధ్యాయులు కైలాస్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కైలాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంటే నిరంతర విద్యార్థిగా ఉండాలని, నూతన టెక్నాలజీకి అనుగుణంగా మన బోధన ఉండాలని సూచించారు. వినూత్న పద్ధతిలో విద్యాబోధన చేస్తూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షబ్బీర్ అహ్మద్, ప్రిన్సిపాల్ పర్వీన్, టీచర్ మోటివేటర్స్ జబడే రవి,కడప కు చెందినరవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## భూసేకరణ, నష్ట పరిహారం చెల్లింపు ప్రక్రియ

# పకడ్బందీగా చేపట్టాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**మంచిర్యాల, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ, నష్ట పరిహారం చెల్లింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జాతీయ రహదారులు, అటవీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు, అదనపు కలెక్టర్లతో హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్, హైదరాబాద్ - విజయవాడ 6 వరుసల జాతీయ రహదారి- 65 రోడ్డు పనులు, హైదరాబాద్ నుండి అమరావతి, మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్, హైదరాబాద్ - శ్రీశైలం 4 వరుసల జాతీయ రహదారి 765 రోడ్డు పనులు, జాతీయ రహదారి 163 మన్నెగూడ సెక్షన్ 4 వరుసల రోడ్డు, హైదరాబాద్ - మంచిర్యాల 4 వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడార్ పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపడుతున్న జాతీయ రహదారులు, గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ, నష్ట పరిహారం చెల్లింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల సంస్థ, రాష్ట్ర అధికారులు సమన్వయంతో పని చేస్తూ జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ భూసేకరణ పూర్తి చేయాలని తెలిపారు. జాతీయ రహదారి 163జి పరిధిలో పెండింగ్ లో ఉన్న 130 హెక్టార్ల భూ బదలాయింపు ప్రక్రియ ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని, రహదారి పరిధిలో ఉన్న జిల్లాల కలెక్టర్లు ప్రత్యేకంగా ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలు కలెక్టర్లు నేరుగా రైతులతో చర్చించాలని, వారికి జాతీయ రహదారుల సంస్థ ద్వారా మెరుగైన పరిహారం అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. రహదారుల నిర్మాణాలలో అవసరమైన అటవీ శాఖ అనుమతులు, కోర్టు కేసులను త్వరగా పరిష్కరించి సంబంధిత యజమానులకు నష్టపరిహారం అందించాలని తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణంలో భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత రహదారులు రవాణా- జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ద్వారా రాష్ట్రపతి పేరిట ముటేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటవీ శాఖలోని వన్యప్రాణి సంరక్షణ పరిధిలోని రాని భూములకు సంబంధించి అనుమతులను త్వరగా మంజూరు చేసేలా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇట్టి భూములకు బదులుగా అటవీ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జి పరిధిలో 3వ



విడత ఆర్బిట్రేషన్ కొరకు దాఖలు చేసిన 114 కేసులను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదారి 63కు సంబంధించి జిల్లాకు చెందిన 17 గ్రామాలలో కోర్టు స్టే కలిగిన గ్రామాలను మినహాయించి మిగిలిన గ్రామాలలో అవార్డు జారీ చేయడం జరిగిందని, అక్టోబర్ 30వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంస్కృతిక ఆత్మను ప్రతిబింబించే గొప్ప వేడుక బతుకమ్మ

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

సాంస్కృతిక ఆత్మను ప్రతిబింబించే బతుకమ్మ, దసరా పండుగలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్ల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలు తెలంగాణలో గొప్ప వేడుకలు ప్రజలు భారీగా పాల్గొనే ఈ పండుగలకు సంబంధించి భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్, పార్కింగ్, ఆరోగ్య



సదుపాయాలు వంటి అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేయాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పండుగలు శాంతియుతంగా, ఆనందంగా జరగేలా చూడాలన్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి, ప్రజలు సంతోషంగా పండుగలను జరుపుకునేలా కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నేటి నుంచి జిల్లాలో ఆయా శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలు ఏమైనా ఉంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.







# అదనపు కలెక్టర్ భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం, ప్రజల భద్రత దృష్ట్యా అదనపు కలెక్టర్ కార్యాలయాన్ని మార్చడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇటీవల భారీ వర్షానికి ఆదిలాబాద్ కలె క్టరేట్‌లోని కొంత భాగం కూలిపోవడంతో అందులోని వివిధ విభాగాల కార్యాలయాలను ఇతర చోట్లకు తరలిస్తున్నారు. ఇందులో భాగంగానే అదనపు కలెక్టర్ కార్యాలయాన్ని పెను గంగా భవన్‌కు మార్చడంతో సోమవారం నూతన అదనపు కలెక్టర్ భావనాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ని శాలువతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని, ఏవో వర్ణ, పలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### తహసీల్ కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్..

జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్ ఆర్డీవో క్వార్టర్స్ మావల తహసిల్దార్ కార్యాలయానికి కేటాయించిన సందర్భంగా సోమవారం కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రారం భించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ వేణుగోపాల్, రెవెన్యు సిబ్బంది తదితరులు ఉన్నారు.






### నెలాఖరులోపు

# భూసేకరణ పూర్తి చేయాలి

### వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
### కోర్టు కేసులు ఉన్న భూముల వివరాలను
### ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లకు ఆదేశాలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**

జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన స్థల సేకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం డా.బిఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి సూచనలు జారీ చేశారు. దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తి కావాలని సీఎం స్పష్టం చేశారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి నిర్మాణ పనులలో జాప్యం జరుగకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులకు ఆదేశించారు. భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరుగకూడదని, జిల్లాల వారీగా సమీక్ష చేపట్టి పురోగతిని పరిశీలిస్తానని జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



# నిండు ప్రాణాలను బలితీసుకున్న క్షణికావేశం



## వలస కార్మికుల కుటుంబం ఆత్మహత్యాయత్నం - తల్లి, పాప మృతి.. భర్తకు గాయాలు

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ మండలం చింతగూడ వద్ద ఇటుక బట్టీలో కూలి కోసం జార్కండ్ నుండి భార్యా పిల్లలతో జానకిరామ్ వలస వచ్చాడు. నిన్నరాత్రి అతిగా మద్యం తాగి భార్యతో గొడవపడి తాను ఆత్మహత్య చేసుకుంటానని కాగజ్‌నగర్–ఈస్‌గాం రైల్వే ట్రాక్‌పై కూర్చున్నాడు. భర్త చావును తప్పించేందుకు ఏడాది నిండని కుమార్తెను ఎత్తుకుని భార్య పరుగున రైల్వే ట్రాక్ వద్దకు వచ్చి భర్తను ఆత్మహత్య చేసుకోవద్దని రైల్వే ట్రాక్‌పై కాళ్లవేళ్ల పడి బతిమాలింది. అంతలోనే ఎదురుగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో భార్య స్వప్న(25), పది నెలల కూతురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన ప్రతీ ఒక్కరిని కదిలించి వేసింది. భర్త జగత్ రామ్ గాయాలతో ఆసుపత్రి పాలు కాగా భార్య, బిడ్డ మృతదేహాలు చూసి ఇటుక బట్టి కూలీలు కంటతడి పెట్టారు. పొట్ట చేత పట్టుకొని ఉపాధి కోసం వచ్చి రైల్వే ట్రాక్‌పై ప్రాణాలు కోల్పోయిన ఘటనపై రైల్వే పోలీసులు కాగజ్‌నగర్‌లో పంచనామా నిర్వహించారు.



# ర్యాగింగ్ భూతానికి విద్యార్థి బలి

- బలవంతంగా మద్యం తాగించి, బార్‌లో రూ.10 వేల బిల్లు కట్టాలని ఒత్తిడి
- తాళలేక బీటెక్ ఫస్టియర్ విద్యార్థి ఆత్మహత్య
- మేడ్చల్ జిల్లా నారాపల్లిలో ఘటన

**ఉట్నూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
సీనియర్ల వేధింపులు తాళలేక ఉరేసుకుని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ జిల్లా నారాపల్లిలో జరిగింది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన జాదవ్ సాయితేజ నారపల్లిలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువు తున్నాడు. సాయితేజకు సీనియర్లు బలవంతంగా మద్యం తాగించడంతోపాటు బార్‌కు తీసుకెళ్లి మద్యం తాగారు. అనంతరం రూ.10 వే ల బిల్లు కట్టాలని జాదవ్‌పై ఒత్తిడి చేశారు. సీనియ ర్ల వేధింపులు తట్టుకోలేక



నా రాపల్లిలోని మధు బాయ్స్ హాస్టల్‌లో ఉన్న తన రూ మ్‌లో సాయితేజ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాస్టల్ నిర్వాహకులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీనియర్లు ర్యాగింగ్ చేయడం వల్లే సాయి ఆత్మహత్య చేసుకున్నాడని తోటి స్నేహితులు తెలిపారు.

# ఒక్కో కార్మికుడికి రూ.1,95,610

## సింగరేణి ఉద్యోగులకు 34శాతం బోనస్

**మంచిర్యాల, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
సింగరేణి సంస్థ గడించిన లాభాలను ఎట్టకేలకు ప్రకటించింది. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు 2024–25 ఆర్థిక సంవత్స రానికిగాను సంస్థ ఆర్జించిన నికర లాభం రూ. 6,394 కోట్లుగా ప్రకటించారు. అందులో సింగరేణి భవిష్యత్తు లో చేపట్టే కొత్త ప్రాజెక్టుల కోసం రూ. 4,034 కోట్లను కేటాయించగా, మిగిలిన రూ. 2,360 కోట్లలో రూ. 34 శాతం సొమ్ము అంటే రూ. 819 కోట్లను కార్మికుల వాటాగా బోనస్‌గా ప్రకటించారు. ఈ లెక్కన సంస్థలో పని చేస్తున్న 41వేల మంది కారికులకు ప్రకటించిన ప్రకారం 34 శాతం లాభాల బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ. 1,95,610 వరకు లభించనున్నాయి. గత ఏడాది సగటున ఒక్కో కార్మికుడికి రూ. 1,87,321 లాభాల బోనస్ చెల్లించగా, దాంతో పోల్చితే ఈ ఏడాది సగటున ఒక్కో ఉద్యోగికి అదనంగా రూ. 8,289 వరకు బోనస్ లభించనుంది. ఇదిలా ఉండగా సింగరేణి నికర లాభాలు, కార్మికుల వాటా ప్రకటించడంలో సుదీర్ఘంగా జాప్యం జరిగింది. ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నె లలు గడుస్తుండటంతో ఎట్టకేలకు లాభాల వాటా ప్రకటనకు మోక్షం లభించినట్లయింది. అదే కోలిండియా లో ప్రతీ త్రైమాసికానికి ఒకసారి లాభాలను ప్రకటి స్తుండగా, సింగరేణిలో మాత్రం సుదీర్ఘకాలం పాటు జాప్యం జరగడం పట్ల కార్మికులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక సంవత్సరం ము గిసిన వెంటనే ఆడిట్ నిర్వహించి లాభాలను ప్రకటిం చాల్సి ఉంది. అయితే కొన్నేళ్లుగా లాభాల ప్రకటనకు ప్రభుత్వం ఆరేడు నెలల సమయం తీసుకుంటున్నారు.

**కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5,500 చెల్లింపు....**
పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటాను ప్రకటించిన సింగరేణి యాజమాన్యం సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా ఒక్కొక్కరికి రూ. 5,500 బోనస్ ప్రకటించింది. గతేడాది కాంట్రాక్టు కార్మికులకు రూ. 5వేల చొప్పున బోనస్ ప్రకటించగా, ఈ ఏడాది రూ. 500 అదనంగా ఇస్తూ నిర్ణయం తీసుకుంది. యాజమాన్యం నిర్ణయంతో సంస్థలో పని చేస్తున్న 30వేల మంది కార్మికులకు లబ్ది చేకూరనుంది.

**కార్మికులకు 34 శాతం లాభాల బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే**
సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే నని మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సింగరేణి బొగ్గగనులను ఆక్షన్‌లో పాల్గొనకుండా గత ప్రభుత్వం అడ్డుకుందని, ఈ కారణంతో గత మూడేళ్ల నుంచి కొత్త గనులు రాలేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ఎప్పుడూ చెల్లించలేదని కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5,500చెల్లిస్తుందన్నారు. సిం గరేణిలో ప్రమాదవశాత్తూ ఎవరైనా చనిపోతే కోటి రూపాయల పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



# ఓ వైపు తండ్రి.. మరో వైపు తల్లి

## వాగులో కొట్టుకుపోయిన తల్లిని కాపాడిన కుమారుడు.. తండ్రి మృతి

**జైనూర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**



వ్యవసాయ భూమిలో పనులకు వెళ్లిన భార్య, భర్త, కుమారుడు వర్షం కారణంగా ఇంటికి తిరుగు ముఖం పట్టిన దారిలో వాగు దాటుతున్నారు. ఈ తరుణంలో ఒక్కసారిగా వాగు ఉధృతి పెరిగింది. ఈ ఉధృతి కారణంగా తల్లి, తండ్రి కొట్టుకుపోతున్న సందర్భంలో ప్రాణాలు తెగించి తల్లిని కాపాడిన కుమారుడు, క్షణంలో తండ్రి వాగులో పడిపోయిన ఘటన ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలంలో చింతపల్లి పంచాయతీ పరిధిలో కిషన్ నాయక్ తండా లో జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్ నాయక్ తండా వాసులైనా జాదవ్ కనిరామ్(80), భార్య సరస్వతి, కుమారుడు అభినందన్ లు కలిసి వ్యవసాయ పనుల కోసం ఆదివారం చేనులోకి వెళ్లారు. ఇంటికి బయలుదేరే సమయంలో జోరుగా వర్షం కురిసింది. దారి మధ్యలో ఉన్న వాగును దాటుతుండగా ఒక్కసారిగా వాగు ఉధృతి పెరిగింది. ఈ సమయంలో తండ్రి కన్నిరామ్, తల్లి సరస్వతి ఇద్దరు చెరోవైపు కొట్టుకపోతుండగా ప్రాణాలకు తెగించి తల్లిని తన భుజాలపై తీసుకొని ఒడ్డుకు చేర్చాడు. ఇంతలోనే తండ్రి వాగులో మునిపోయాడు. రాత్రి అంత వెతికిన కన్నిరామ్ మృతదేహం లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం కన్నిరామ్ మృతదేహం లభ్యమైంది. వాగులో తల్లి, తండ్రి కొట్టు కుపోతున్న సందర్భంలో తల్లిని కాపాడిన, తండ్రిని మాత్రం కాపాడలేకపోయానని కుమారుడి రోదన వర్ణనాతీతం.

# గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు

**ఇచ్చోడ, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
రైతులు తమ పంట పొలాలలో అంతర పంటగా గంజాయిని పండిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ సిఐ. బండారి రాజు హెచ్చరించారు. మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు జయబాయ్ అంకుష్, జయబాయ్ పరమేశ్వర్, తండ్రి కొడుకులు తమ పొలంలో అంతర పంటగా పది గంజాయిని మొక్కలు పెంచుతున్నారని పక్క సమా చారం రావడంతో ఆ చేనులు పోలీస్ సిబ్బందితో వెళ్లి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని వారిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. సీఐ రాజు మాట్లాడుతూ మండలంలో ఎవరైనా గంజాయి పండిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా.. ప్రయాణికులకు స్వల్ప గాయాలు





**బోథ్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
సోనాల మండలంలోని సాకేర గ్రామం వద్ద సోమవారం రాత్రి ప్రవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన ఘటన నియోజకవర్గంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుండి నేపాల్‌కు దాదాపు 100 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. బస్సు ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రమాద స్థలానికి చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలను ప్రయాణికులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం క్షత గాత్రులను 108 అంబులెన్సులలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి డాక్టర్లతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. స్థానిక పోలీసులు బస్సు ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకొని ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అయితే పలు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఆర్టీవో తనిఖీల నుండి తప్పించుకోవడానికి బోథ్ ఎక్స్ రోడ్ నుండి సోనాల వెళ్లే దారి గుండా ఇతర రాష్ట్రాలకు అనధికారికంగా ప్రైవేట్ ట్రావెల్స్ నడుస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

# వరద ఉధృతికి వాగులో మహిళ గల్లంతు

**ముథోల్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
భైంసా రూరల్ పరిధిలోని మాటేగాం గ్రామానికి చెందిన సురేష్, భిజ్జూర్ గ్రామానికి చెందిన కంటోళ్ల లక్ష్మీబాయి శనివారం వాగులో గల్లంతయినట్టు స్థానికులు తెలిపారు. యజమాని నగేష్ రెడ్డి మేరకు వ్యవసాయ పనుల నిమిత్తం ఎడ్లబండి, బర్రెతో పొలాలకు వెళ్తున్నాడు ఎడ్ల బండి పై వస్తానని చెప్పిన మహిళ లక్ష్మీబాయి వాగు దాటుతుండగా ప్రమోదవశత్తు వాగులో పడి గల్లంతయ్యింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ స్వయంగా వాగు ప్రాంతాన్ని సందర్శించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంఘటన స్థలం చేరుకున్న ఆమె ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ వర్షాల కారణంగా అనవసరంగా ఎవరు కూడా బయటకు రావొద్దని, వాగులు వంకలు దాటే ప్రయత్నం చేయరాదని, ముఖ్యంగా వ్యవసాయ రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ ఘటన సందర్భనలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, ఇన్స్పెక్టర్ నైలు, సమ్మయ్య, ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.







# బాసరలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**ముథోల్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో సోమవారం శరధియా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ఆలయంలోని శ్రీ జ్ఞాన సరస్వతి శ్రీ మహాలక్ష్మి శ్రీ మహాకాళి అమ్మవార్లకు మంగళ వాయిద్యాలతో విశేష అభిషేకము అలంకరణ నిర్వహించరు. ఉదయం 9 గంటలకు అమ్మవారి చెంత ఆలయ వేద పండితులు అర్చకులు వేద మంత్రోచ్చారణలతో విగ్నేశ్వర పూజ, క్షేత్ర పూజ, అంకురార్పణ, కలశ స్థాపన ఘటాస్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలోని అమ్మవార్లను దర్శించుకుని తమ చిన్నారులకు అక్షరాభ్యాస పూజలను జరిపించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయులు శరత్ పాటక్, ఆలయ ఈవో అంజనీ దేవి, స్థానచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి పాల్గొన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఉమ్మడి రాష్ట్రం నుండే కాకుండా మహారాష్ట్ర- కర్ణాటకతో పాటు

## మొదటి రోజు శైలపుత్రి అవతారంలో అమ్మవారు

దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు రోడ్డు, రైలు మార్గాల ద్వారా అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారి చెంత ప్రవహించే పవిత్ర గోదావరి నదిలో స్నానమాచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలు సైతం రాత్రి పూట నిర్వహించనున్నారు.

**శైలపుత్రి అవతారంలో అమ్మవారు..**
ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో మొదటి రోజు సోమవారం శైలపుత్రి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ అర్చకులు విశేషా అర్చన నిర్వహించి కట్టెపొంగలిని ప్రసాదంగా అందజేశారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఉమ్మడి రాష్ట్రం నుండే కాకుండా మహారాష్ట్ర- కర్ణాటకతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు రోడ్డు, రైలు మార్గాల ద్వారా అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారి చెంత ప్రవహించే పవిత్ర గోదావరి నదిలో స్నానమాచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# హక్కుల కోసం కదం తొక్కిన అడవి బిడ్డలు

### వలస లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాల్సిందే..
### ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
అనాదిగా అడవులను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, హక్కుల కోసం న్యాయపోరాటమే శరణ్యమని ఆదివాసి సంఘాలు నేతలు తమ ఆవేదనను వెళ్లగక్కారు. చట్టబద్ధతలేని వలస లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాయి సెంటర్లు, సార్ మేడిలు, రాజ్ గోండు సేవా సమితి, తుడుం దెబ్బ ఇలా 9 ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ముందుగా తంతోలి ముత్యాలమ్మ ఆలయం నుండి ఆదిలాబాద్ కలెక్టరేట్ వరకు ఆదివాసీ మహిళలు, యువకులు, జెండాలు చేత పట్టుకొని పెద్దపెట్టున నినాదాలు చేస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించి కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా ఆదివాసి సంఘాల నాయకులు మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాల నుండి రిజర్వేషన్ల కోసం వలస వచ్చిన లంబాడాలతో ఆదివాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. 1970 తర్వాత ఆదిలాబాద్ జిల్లాకు వలస వచ్చిన లంబాడాలు తమ హక్కులను రిజర్వేషన్లను వినియోగించుకుంటూ తమ జీవన ప్రమాణాలు దెబ్బతిస్తున్నారని ఆరోపించారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల కుటుంబాలు ఎస్టీ రిజర్వేషన్ల కోసమే వలస వచ్చి ఉపాధి పొందుతున్నాయని వారు ఆరోపించారు. చట్టబద్ధతలేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ఇప్పటికే సుప్రీం కోర్టు నుండి ప్రభుత్వాలకు నోటీసులు కూడా అందాయని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు మంగం విశ్వంభర్, గణేష్, తానాజీ, శ్యామ్ రావు, జంగు పటేల్, ఆనందరావు, వెంకటేష్ పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# సరిహద్దులో హై అలర్ట్

### ప్రాణహిత నది తీరం వెంట పోలీసుల తనిఖీలు



**కోటపల్లి, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో పోలీసులు హై అలెర్ట్ ప్రకటించారు. ఈ నెల 21 నుంచి 27 వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో సరిహద్దులో ఎలాంటి అలజడులకు తావివ్వకుండా పోలీసులు అ ప్రమత్తమయ్యారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రెండు రోజు లుగా చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్, నీల్వాయి,కోటపల్లి ఎస్ఐలు కోటే శ్వర్, రాజేందర్‌లు మండలంలోని ప్రాణహిత నది తీరం వెంట తని ఖీలు చేపట్టారు. ప్రాణహిత నది మార్గంలోని ఫెర్రీ పాయింట్లను పరిశీ లించా రు. సరిహద్దు గ్రామాల నుంచి మహారాష్ట్ర వైపు నది మార్గంలో జరుగుతున్న రాకపోకలకు తనిఖీలు చేపట్టి జాలర్లు, పడవల నిర్వహాకు లతో మాట్లాడారు. అనుమానస్పద వ్యక్తులు కనబడితే తమకు సమాచా రం అందించాలని, అపరిచిత వ్యక్తులకు సహకారం అందించకూడదని సూచించారు. మరో వైపు జాతీయ రహదారిపై అంతర్ రాష్ట్ర వంతెన వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఆటోలు, కార్లు, ద్విచక్రవాహ నాలను తనిఖీలు చేసి ప్రయాణికుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ మావోయిస్టులు అడవుల్లో ఉండి హింసాత్మక ఘటనలకు పాల్పడుతూ సాధించేది లేదని, జనజీవన స్రవంతిలోకి రావాలన్నారు.

# 'జీతాలు ఇవ్వలేని స్థితిలో సర్కార్'

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 22 (ప్రభాత సమాచారం)**
పండుగ పూట కార్మికులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ సర్కార్ ఉందని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమ వారం కాగజ్‌నగర్ పట్టణంలోని మిషన్ భగిరథ కార్మికులు సోమవారం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కలిసి తమ జీవితాలు ఇప్పించాలని కోరగా ఆయన స్పందించి మాట్లాడారు 5 నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం కార్మికులను ఇబ్బందులకు గురి దారుణమని.. సిఎం. ఎమ్మెల్యే జీతాలు తీసుకుంటూ పండుగ పూట కార్మికులను పస్తులు ఉంచుతోందని విమర్శించారు. వెంటనే కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు.